ఆకుకూరల రైతు విలవిల

కావలి మండలంలో ఆకుకూరలు సాగుచేసిన రైతులు వర్షాలకు విలవిల్లాడుతున్నారు. తీరప్రాంత గ్రామాల్లోని ఇసుక నేలల్లో సాగుచేసిన ఆకుకూరలు వర్షాలకు పాచి పోతుండడంతో ఏమి చేయాలో దిక్కు తోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోతుండడంతో ఆవేదన చెందుతున్నారు.


వర్షాలకు దెబ్బతిని పలుచగా ఉన్న మొలకకూర


వర్షాలకు నేలవాలిన తోటకూర


వర్షాలకు దెబ్బతిన్న చిర్రాకు

కావలి: కావలిలో రైతుబజార్ కేంద్రంగా నిత్యం అన్ని రకాల కూరగాయలు 20 టన్నులకుపైగా అమ్మకాలు జరుగుతాయి. బెండ, చిక్కుళ్లు, సొరకాయి, మిర్చి, మామిడి, మునగ, చామ, వంకాయి తదితర కూరగాయలు కావలి, బోగోలు, దగదర్తి, జలదంకి, కలిగిరి, వింజమూరు, కొండాపురం మండలాల నుంచి అడపాదడపా కావలి మార్కెట్‌కు వస్తుంటాయి. అయితే ఆయా ప్రాంతాల నుంచి కావలి మార్కెట్ అవసరాలు తీర్చేంత రావు. అందుకే ఈ రకమైన వాటితో పాటు మిగిలిన అన్ని రకాల కూరగాయలు ఇతర ప్రాంతాల నుంచి కావలికి నిత్యం దిగుమతి అవుతుంటాయి. అయితే ఆకు కూరలను మాత్రం వాడిపోతాయని దిగుమతి చేసుకోరు. అందుకే స్థానికంగా పండించే ఆకుకూరలకు బాగా డిమాండ్ ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకుని కావలి రూరల్ మండలంలోని తుమ్మలపెంట పంచాయతీ పరిధిలోని కొత్తసత్రం, రెడ్డిపాళెం, ఇందిరానగర్, అన్నగారిపాళెం పంచాయతీ పరిధిలోని పూలదొరువు, మామిళ్లదొరువు, అన్నగారిపాళెం తదితర గ్రామాలకు చెందిన రైతులు గత కొన్నేళ్లుగా ఆకుకూరలు సాగుచేస్తున్నారు. రైతులు వారికి ఉన్న కొద్దిపాటి భూమిలోని రకరకాల ఆకుకూరలను పండిస్తుంటారు. స్వల్పకాలంలో చేతికి అందే వాటిని కావలి మార్కెట్‌కు తరలించి లాభాలను పొందుతుంటారు.

వర్షాలతో తీవ్రనష్టం

కావలి మండలంలోని రైతులు గోంగూర, తోటకూర, పెరుగు తోటకూర, మెంతికూర, చుక్కకూర, పాలకూర, పొనగంటి ఆకు, చిర్రికూర, తదితర రకాలను ఎక్కువగా పండిస్తుంటారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు ఆకు కూరలను దెబ్బతీశాయి. వర్షాలకు తేమ ఎక్కువై ఆకుకూరలు పాచిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. నెల నుంచి రెండు నెలల్లోపు ఆకు కూరలు చేతికందుతాయి. ఆకుకూరలను ఒకేసారి పీకి తరలించడం సాధ్యపడదు. ప్రతి నిత్యం కొద్దిగా పీకి కట్టలు కట్టి మార్కెట్‌కు తరలించాల్సి ఉంటుంది. ఆకు కూరలు మొలిచిన తరువాతే వర్షాలు పడడంతో దెబ్బతిన్నాయి. అరకొరగా మిగిలిన వాటిని వదిలేయలేక అష్ట కష్టాలు పడి కాపాడుకున్నప్పటికీ ఫలితం లేదు. ఆకుకూరలు సాగుకు రూ.10వేల నుంచి రూ.25వేల వరకు పెట్టుబడులు పెట్టామని, పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వర్షాలకు నష్టపోయాం



ఇటీవల మార్కెట్లో కూరగాయలు ధరలు బాగా ఉండటంతో ఆకుకూరల అమ్మకాలు జోరుగా ఉన్నాయి. ఆకుకూరలకు ధరలు కూడా బాగానే ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలు ఆకుకూరల రైతులకు తీవ్రనష్టాన్ని మిగిల్చాయి. వర్షాలకు ఆకుకూరలు దెబ్బతిని పాచిపోవడంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

–రామకృష్ణ, రైతు, తుమ్మలపెంట

కష్ట ఫలితం దక్కలేదు



ఇంటిల్లిపాది కష్టపడి ఆకుకూరలు సాగుచేస్తాం. ఈ దఫా వర్షాలు ఆకుకూరలను మింగేశాయి. వర్షపు నీరు నిల్వ ఉండడంతో ఆకుకూరలు పూర్తిగా పాచిపోయాయి. కష్టానికి ఫలితం కూడా దక్కలేదు.

–మంగమ్మ, రైతు, రెడ్డిపాళెం

ఆకుకూరలు పాచిపోయాయి



ఈ దఫా ఆకుకూరల సాగు బాగాలేదు. ఆకుకూరలు సాగు చేయగానే వర్షాలు వచ్చాయి. తెరిపివ్వకుండా వారం పాటు వర్షాలు కురవడంతో మొలిచిన ఆకు కూరలు దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన కూరలను కూడా కోసి మార్కెట్ కు తరలించడానికి సాధ్యపడలేదు. వర్షం ఆగిన తర్వాత చూస్తే పడిపోయి పాచిపోయింది.

– తిరుపతి, రైతు, కొత్తసత్రం

పెట్టుబడి కూడా నష్టపోయా



వర్షాలకు ముందు చిర్రాకు, పొనగటి ఆకు, తోటకూర సాగుచేశా. వర్షాలు బాగా పడుతుండగానే ఇక పైరు చేతికి దక్కదని ఆందోళన చెందా. వర్షాలు ఆగిపోయిన తర్వాత చూస్తే నా భయమే నిజమైంది. పెట్టుబడి కూడా నష్టపోయా.

–వెంకమ్మ, రైతు, రెడ్డిపాళెం

క్లుప్తంగా

ఉదయగిరిలో జాబ్‌మేళా



ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. అమెజాన్, శ్రీశుభోదయం మేనేజ్‌మెంట్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, అమరరాజా, తదితర కంపెనీల్లోని ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 54 మంది హాజరయ్యారు. అందులో 22 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం, ప్లేస్‌మెంటు అధికారి జనార్దన్, కళాశాల ప్రిన్సిపల్ నారాయణస్వామి, వైస్ ప్రిన్సిపల్ నరసింహులు, అక్మల్,విశ్వరూప్ పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ విజిటింగ్



ఆత్మకూరు: ఇండస్ట్రియల్ విజిటింగ్‌లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10 తరగతుల విద్యార్థులు సూపర్ మార్కెట్‌ను శుక్రవారం సందర్శించారు. హెచ్ఎం పెంచలయ్య ఆధ్వర్యంలో ఒకేషనల్ ట్రెయిన్ నాగం వెంకటేశ్వర్లు సూపర్ మార్కెట్ నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిల్‌కాలనీలో వైద్యశిబిరం



ఆత్మకూరు(సోమశిల): అనంతసాగరం మండలం సోమశిల హిల్‌కాలనీలో జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరపీడితులకు వైద్యపరీక్షలు నిర్వహించి రక్తనమూనాలు సేకరించారు. వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి దోమల లార్వా సర్వే చేపట్టారు. నిల్వ నీటిని పారబోయించారు. దోమలతో వ్యాప్తి చెందే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఈఓ ఎం చిన్నయ్య, ఓ అనూషా,హెల్త్ అసిస్టెంట్ టీ ప్రసాద్, ఏ ఖాదర్, ఏఎన్ఎం శివకుమారి, ఆశాలు వసంత, ధనమ్మ, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

సమయాన్ని పాటించాలి



ఉదయగిరి: అంగన్‌వాడీ కార్యకర్తలు సమయాన్ని పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాను అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి-2, దుత్తలూరు, నర్రవాడ సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంగన్‌వాడీలు అందుబాటులో ఉండాలన్నారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై కిశోరబాలికలకు అవగాహన కల్పించి వాటి నివారణకు కృషి చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

చేజర్ల: విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని విద్యుత్ శాఖ ఏఈ లిఖితేష్‌రెడ్డి కోరారు. ఆదూరుపల్లిలో విద్యుత్ బిల్లుల బకాయిల వసూలుకు బుధవారం ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపుపై అవగాహన కల్పించారు.

2న తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలి



సంగం: మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో డిసెంబరు 2న తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని ఎంఈఓ జానకీరాం ప్రధానోపాధ్యాయులకు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రుల సమావేశం నిర్వహణపై సూచనలు చేశారు. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు.

విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధం

సంగం: తుఫాన్ ప్రభావంతో జిల్లాలో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని విద్యుత్‌శాఖ ఏఈ ఉడతా మన్మథరావు తెలిపారు. శుక్రవారం ఆయన సంగంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విద్యుత్‌శాఖ కార్యాలయంలో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని తెలిపారు. వర్షాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమకు సమాచారం అందజేయాలని కోరారు.

చౌటభీమవరం ఇన్‌చార్జి వీఆర్వోగా ప్రసాద్

సాక్షి ఎఫెక్ట్..

అనుమసముద్రంపేట: చౌటభీమవరం గ్రామానికి గత కొద్ది రోజులుగా వీఆర్వో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై 'సాక్షి'లో 'వీఆర్వో లేక ఇబ్బందులు' శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆత్మకూరు ఆర్డీఓ టీ పావని స్పందించారు. కొండమీదకొండూరు వీఆర్వో వీ ప్రసాద్‌ను చౌటభీమవరానికి ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అనాథకు దహన సంస్కారాలు

కావలి: పట్టణంలోని అభయం స్వచ్ఛంద సంస్థకు చెందిన సేవకులు అనాథ వ్యక్తికి శుక్రవారం దహన సంస్కారాలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. గౌరవరం సమీపంలో జాతీయ రహదారిపై భిక్షాటన చేసుకునే వ్యక్తి మరణించగా కావలి రూరల్ ఎస్సై బాజీరావు అభయం స్వచ్ఛంద సంస్థకు సమాచారం అందజేశారు. స్పందించి అభయం సేవకులు బాషా, సాయి, వంశీకృష్ణ తమ వద్ద ఉన్న అంతిమయాత్ర వాహనంతో అక్కడికి చేరుకుని భిక్షాటన చేసే వ్యక్తి మృతదేహాన్ని పట్టణంలోని శ్మశానవాటికకు తరలించి దహనసంస్కారాలు చేశారు.

ఎంపీడీఓకు ఫిర్యాదు

అనుమసముద్రంపేట: తనపై పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని చౌటభీమవరం సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ దేవకుమార్ ఎంపీడీఓ ప్రసన్నకుమారికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. తన వేతన బిల్లును ప్రభుత్వానికి పంపలేదని. ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. వేతనం మీదే ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, వేతనం రాకుంటే కుటుంబ పోషణకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా తనతో ఆడుకుంటున్న వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా ఆవాజ్ ఆవిర్భావ దినోత్సవం


ఉదయగిరి: పండ్లు పంపిణీ చేస్తున్న ఆవాజ్ కమిటీ సభ్యులు


ఆత్మకూరు ఉర్దూ పాఠశాలలో..


మర్రిపాడులో పండ్లు పంపిణీ

ఆత్మకూరు: పట్టణంలోని 17వ వార్డు పరిధిలోని టెక్కే ఉర్దూ పాఠశాలలో ఆవాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు, పెన్నులు పంపిణీ చేశారు. గద్దర్ బాబు పాడిన భక్తిగీతాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఆవాజ్ కమిటీ సభ్యులు పీ మస్తాన్, పీ సల్మాన్‌ఖాన్, షేక్ ఖాజారంతుల్లా, ఉపాధ్యాయులు కాలేషా, సుశీలమ్మ పాల్గొన్నారు.

మర్రిపాడు : ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో మర్రిపాడులోని ఎస్సీ బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. వార్డెన్ సుకుమారిని, ఆవాజ్ మండల కమిటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ రహమతుల్లా, సభ్యులు సయ్యద్ కాలేషా, షేక్ మహబూబ్‌బాషా, సయ్యద్ నాయబ్, సయ్యద్ ముస్తాఫ, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: మండలంలోని బిజ్జంపల్లె బీసీకాలనీలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో స్వీట్లు, బిస్కెట్లు, పెన్నులను పంపిణీచేశారు. ఆవాజ్ కమిటీ నాయకులు నాయబ్‌రసూల్‌బాషా, రజాక్‌అన్వర్ పాల్గొన్నారు.

భూములు లాక్కొని కడుపు కొట్టొద్దు


వరి సాగును చూపుతున్న రైతు

ఉదయగిరి: తాము ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములను లాక్కొని తమ కడుపుకొట్టొద్దని సర్వరాబాదుకు చెందిన దళిత రైతులు రెవెన్యూ అధికారులను వేడుకున్నారు. మండలంలోని నేలటూరు పంచాయతీ పరిధిలోని సర్వరాబాదులో దళిత రైతులు సాగుచేసుకుంటున్న భూముల్లో గురువారం రెవెన్యూ అధికారులు 'ఇది ప్రభుత్వ భూమి' అని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంపై శుక్రవారం వారు విలేకరుల ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. సర్వే నంబర్ 740లోని 10.74 ఎకరాల భూమిని 1977 నుంచి దళితులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అప్పట్లో ప్రభుత్వం సీజేఎఫ్ఎస్ భూములుగా గుర్తించి పట్టాలు కూడా అందజేసింది. అప్పటి నుంచి భూముల చుట్టూ కంచె సైతం ఏర్పాటు చేసుకుని బోర్లు వేసుకుని పంటలు సాగు చేసుకుంటున్నామని తెలిపారు. గత కొన్నేళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు అసైన్‌మెంట్ పట్టాలివ్వాలని అధికారులు చుట్టూ తిరుగుతున్నామన్నారు. అయినా డీ-ఫారం పట్టాలు ఇవ్వకుండా, తమకు ముందస్తు నోటీసులు జారీ చేయకుండా, కనీస సమాచారం లేకుండా అధికార పార్టీ నేతల ప్రోద్బలంతో తాము సాగుచేసుకునే భూముల వద్ద ప్రభుత్వ భూములని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

జియోట్యాగింగ్‌ను వేగవంతం చేయాలి

ఆత్మకూరురూరల్: గృహాల జియోట్యాగింగ్, ఎన్‌పీసీఐ లింకేజీని వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని మహిమలూరు, నువ్వూరుపాడు సచివాలయాల పరిధిలో జరుగుతున్న జియోట్యాగింగ్‌ను శుక్రవారం ఆయన క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని సూచించారు. గృహాలు నిర్మించుకునే వారిని గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు అవసరమైన లబ్ధిదారులను గుర్తించి జియోట్యాగింగ్ చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీప్రసన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరి

వరికుంటపాడు: మండలంలోని ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, ఎన్‌పీసీఎల్ చేయించుకోవాలని ఎంపీడీఓ వేణుగోపాల్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఇంటింటిని సందర్శించి హౌస్‌హోల్డ్ సర్వే నిర్వహించి మ్యాపింగ్ చేస్తున్నారని తెలిపారు. ఈ మ్యాపింగ్ చేయించుకుంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని వివరించారు.

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

వరికుంటపాడు: పాడి పశువుల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ విస్తరణాధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కనియంపాడు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్,జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ , పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఆరోగ్యకరంగా ఉన్న లేగదూడలకు సంబంధించి పాడి రైతులు పీ ధనలక్ష్మి, సురేష్, ఎం రాజశేఖర్‌రెడ్డిక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాడి రైతులకు పశుపోషణలోని మెలకువలను తెలియజేశారు. కృత్రిమ గర్భధారణ, పశుగ్రాసాల సాగుపై అవగాహన కల్పించారు. మేలు జాతి పశుసంపద వృద్ధికి లింగ నిర్ధారణ సెమెన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎస్.చంద్రశేఖరరెడ్డి, పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ,స్థానికులు పాల్గొన్నారు.

రేపు హిందూ సమ్మేళనం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని అయ్యప్పస్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం హిందూ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరిలో విజయవాడలో జరగనున్న హిందూ హైందవ సమ్మేళనానికి సంబంధించిన కార్యాచరణపై సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

11 మద్యం సీసాల స్వాధీనం

కావలి: మండలంలోని మన్నంగిదిన్నె గ్రామంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అనుపల్లి వెంకమ్మ వద్ద 11 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు కావలి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎం దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి కరీష్మా సూచించారు. మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో శుక్రవారం ఆమె వైద్యసేవలు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ అడల్ట్ బీసీజీ టీకాను వేయించుకోవాలని, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

బహిరంగ మలమూత్ర విసర్జన చేస్తే జరిమానా

అల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అల్లూరు నగర పంచాయతీ పరిధిలో బహిరంగ మల, మూత్ర విసర్జనను నిషేధించినట్లు కమిషనర్ ఉమామహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు కలిసి నగర పంచాయతీని బహిరంగ మల,మూత్ర విసర్జన రహితంగా తీర్చిదిద్దాలని తీర్మానించినట్లు చెప్పారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేస్తే రూ.30, మూత్ర విసర్జన చేస్తే రూ.20 జరిమాన విధించనున్నట్లు తెలిపారు.

ముమ్మరంగా పూడికతీత పనులు



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు చెరువుకు సాగునీరు అందించే కాలువలో పూడికతీత పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. సోమశిల ప్రాజెక్ట్ నాల్గో డివిజన్ అధికారుల పర్యవేక్షణలో చేపడుతున్న ఈ పనులను ఇరిగేషన్ డీఈ మెట్టుకూరు మురళీకృష్ణారెడ్డి, ఏఈ పరమేశ్వరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆత్మకూరు చెరువుకు సోమశిల జలాలను సజావుగా అందించేందుకు పూడికతీత పనులు చేపడుతున్నామని డీఈ తెలిపారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్

చేజర్ల: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ పీడీ బీ హేనాసుజన్ పేర్కొన్నారు. ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మహిళా సాధికారత ,బాలల అభివృద్ధిపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. 18 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేసుకోవాలని బాలికలకు సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, రక్తహీనతతో తలెత్తే సమస్యలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు నిర్దేశించిన 1098, 181, 112 నంబర్లపై అవగాహన కల్పించారు. గురుకులం ప్రిన్సిపల్ శైలజకుమారి, వైస్ ప్రిన్సిపల్ నాగలలిత, పీ గజలక్ష్మి, సఖి వన్ సెంటర్ సిబ్బంది ఎస్ ప్రశాంతి, టీ కమల, సాధన, ఐసీడీఎస్ సీడీపీఓ పీ సునీలత, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అన్యాయంగా దాడి చేశారు

- న్యాయం చేయాలని

ఆత్మకూరు డీఎస్పీకి వీఓఏ వినతి


విలేకరులతో మాట్లాడుతున్న వీఓఏ సుజాత

ఆత్మకూరు: తనపై అన్యాయంగా టీడీపీ నాయకుడు దాడి చేయడమే కాకుండా అట్రాసిటీ కేసును సైతం పెట్టించారని, తనకు న్యాయం చేయాలని చేజర్ల మండలం నాగలవెలటూరు గ్రామానికి చెందిన పొదుపు వీఓఏ సుజాత ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేసింది. ఆమె కథనం ప్రకారం.. డ్వాక్రాలో కాంటాక్ట్ బేసిక్‌పై సుజాత వీఓఏగా విధులు నిర్వహిస్తోంది. గ్రామంలోని పొదుపు సంఘాలకు రుణాలను ఇప్పించడం, సకాలంలో తిరిగి చెల్లించేలా చూడడం వంటి విధులు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో అంబేడ్కర్ పొదుపు గ్రూపునకు చెందిన సభ్యురాలు వరలక్ష్మి రెండేళ్ల క్రితం పొదుపు రుణం తీసుకుని తిరిగి చెల్లించకపోవడంతో ఈ నెల 19న వీఓఏతో కలిసి సహచర సభ్యులు అడిగేందుకు ఆమె పనిచేస్తున్న టీడీపీ నాయకుడి ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ వారి మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో టీడీపీ నాయకుడు వీఓఏ సుజాతపై దాడి చేశాడు. దీనిపై చేజర్ల పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో కక్షగట్టిన సదరు నాయకుడు తన ఇంట్లో పని చేసే వరలక్ష్మి ద్వారా తనపై అట్రాసిటి కేసు నమోదు చేయించాడని బాధిత వీఓఏ డీఎస్పీకి వివరించింది. డీఎస్పీని కలిసిన అనంతరం ఆమె విలేకర్లకు జరిగిన విషయాన్ని వివరించింది. ఆమె వెంట పలువురు మహిళలు ఉన్నారు.

గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా


ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లో వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీధర్

ఉదయగిరి: గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎవరైనా విక్రయలు చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని కావలి డీఎస్పీ శ్రీధర్ హెచ్చరించారు. ఉదయగిరి పోలీసు సర్కిల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. తొలుత స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలను పరిశీలించి కేసులను త్వరగా పరిష్కరించి వేలం వేయాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గంజాయి సేవించడం, విక్రయించడం నేరమన్నారు. గంజాయికి బానిసై యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నందున వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మత్తుపదార్థాలు, గంజాయి విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. మత్తు పదార్థాల నిరోధాన్ని ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. ఆయన వెంట సీఐ వెంకట్రావు, ఎస్సైలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఏ శ్రీనివాసులు, ఆదిలక్ష్మి, రఘునాథ్, శివకృష్ణారెడ్డి ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

సీతారామపురం: మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని కావలి డీఎస్పీ శ్రీధర్ హెచ్చరించారు. సీతారామపురం పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. బెల్టుషాపుల నిర్వహణ, గంజాయి, ఇసుక అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్, నాటుసారా, తదితర వాటిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఆయన వెంట ఎస్సై శివకృష్ణారెడ్డి ఉన్నారు.

కూల్‌డ్రింక్ షాపులో చోరీ

చేజర్ల: ఆదూరుపల్లిలోని కూల్‌డ్రింక్ షాపులో గురువారం అర్ధరాత్రి చోరీ చోటు చేసుకుంది. పోలీసులు, షాపు యజమాని షేక్ కాలేషా తెలిపిన వివరాల మేరకు.. కాలేషా రోజులాగే గురువారం రాత్రి కూల్‌డ్రింక్ షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం షాపు తెరిచేందుకు వచ్చి చూడగా షట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. షాపులోని సుమారు రూ.15 వేల విలువైన నగదు, ఇతర సామగ్రిని కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు చేజర్ల ఎస్సై తిరుమలేశ్వరరావు షాపు వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.